
సాక్షి
గ్రేటర్ వరంగల్
(హనుమకొండ - వరంగల్)

శుక్రవారం । 26 । సెప్టెంబర్ । 2025



ఏసీబీ వలలో సైట్ ఇంజనీర్

తెలంగాణ రాష్ట్ర విద్య, మౌలిక సదుపాయాల సంస్థ జనగామ సబ్ డివిజన్ సైట్ ఇంజనీర్ సామల రమేశ్ లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కారు. - 10లో▸



లక్ష్య సాధకులు..

ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన పలువురు అభ్యర్థులు గురువారం టీజీఎస్‌పీఎస్సీ ప్రకటించిన గ్రూప్–1 ఫలితాల్లో విజేతలుగా నిలిచారు. - 10లో▸

గరిష్టం/కనిష్టం
28.0^0 / 22.0^0

వాతావరణం

జిల్లాలో ఆకాశం మేఘావృతమై ఉంటుంది. అల్పపీడన ప్రభావంతో భారీ నుంచి అతిభారీ వర్షం కురిసే అవకాశం ఉంది.

వరంగల్ కలెక్టరేట్‌లో బతుకమ్మ వేడుకల్లో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, డీఆర్‌ఓ విజయలక్ష్మి, అధికారులు తదితరులు



ఎంజీఎంలో వేడుకల్లో సూపరింటెండెంట్ కిశోర్ కుమార్, ఏడీ శ్రీనివాస్ ప్రసాద్, టీఎన్జీవోస్ నేతలు



డీసీసీబీ ప్రధాన కార్యాలయంలో సంబురాల్లో టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్ రావు, సీఈఓ వజీర్ సుల్తాన్, మహిళా ఉద్యోగులు



కేయూ క్యాంపస్: బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న వీసీ ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ రామచంద్రం, మహిళా ఉద్యోగులు



ఆడిపాడి.. సందడి

గ్రేటర్ వరంగల్ నగరంలో బతుకమ్మ వేడుకలు అంబరాన్నంటుతున్నాయి. వర్షాన్ని సైతం లెక్కచేయకుండా బతుకమ్మ ఆడుతున్నారు. గురువారం ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారులు, ఉద్యోగులు బతుకమ్మ ఆడిపాడి సందడి చేశారు. – సాక్షి నెట్‌వర్క్

న్యూస్‌రీల్

నిట్‌లో ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్



కాజీపేట అర్బన్: నిట్ వరంగల్‌లోని మెటలార్జికల్ అండ్ మెటీరియల్స్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో 'ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ ఆన్ అడ్వాన్స్‌డ్ మెటీరియల్స్' పేరుతో మూడు రోజుల ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్‌ను గురువారం సెమినార్ హాల్ కాంప్లెక్స్‌లో ప్రారంభించారు. ముఖ్య అతిథిగా నిట్ డైరెక్టర్ బిద్యాధర్ సుబుదీ పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి కాన్ఫరెన్స్ సావనీర్‌ను విడుదల చేశారు. కార్యక్రమంలో మెటలార్జికల్ విభాగం అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

30న సద్దుల బతుకమ్మ

అక్టోబర్ 2న దసరా వేడుకలు

ఖిలా వరంగల్: రంగలీల మైదానంలో ఈనెల 30న సద్దుల బతుకమ్మ, అక్టోబర్ 2న విజయదశమి (దసరా) వేడుకలు, రావణవధ నిర్వహించనున్నట్లు దసరా ఉత్సవ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు నాగపురి సంజయ్‌బాబు, మేడిది మధుసూదన్, మండ వెంకన్న, ఉపాధ్యక్షుడు గోనె రాంప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వేదపండితుల సూచనలు, ప్రభుత్వ ఆదేశాల ప్రకారం.. తేదీలను ప్రకటించామని వారు పేర్కొన్నారు. నగర ప్రజలు సద్దుల బతుకమ్మ, దసరా వేడుకలకు హాజరై విజయవంతం చేయాలని వారు కోరారు.

రేపు ప్రపంచ పర్యాటక దినోత్సవం

హన్మకొండ అర్బన్: ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా ఈనెల 27న కాకతీయ హరిత హోటల్‌లో పర్యాటక ఉత్సవాలు నిర్వహించనున్నట్లు జిల్లా పర్యాటక శాఖ అధికారి శివాజీ తెలిపారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే ఉత్సవాల్లో భాగంగా సాంస్కృతిక కార్యక్రమాలు, బతుకమ్మ థీం ప్రదర్శనలు ఉంటాయని పేర్కొన్నారు. ఉత్సవాలను పురస్కరించుకుని జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు పర్యాటక రంగంపై వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి ప్రశంసపత్రాలు అందిస్తామని తెలిపారు.

సీపీఐ జాతీయ సమితి సభ్యుడిగా శ్రీనివాస్‌రావు



న్యూశాయంపేట: సీపీఐ జాతీయ సమితి సభ్యుడిగా ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన తక్కళ్లపల్లి శ్రీనివాస్‌రావు మరోసారి ఎన్నికయ్యారు. ఈ మేరకు చండీగఢ్‌లో జరుగుతున్న 25వ జాతీయ మహాసభల్లో ఆయనను ఎన్నుకున్నారు. ప్రస్తుతం ఉమ్మడి వరంగల్ జిల్లా పార్టీ నిర్మాణ బాధ్యుడిగా, సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శిగా శ్రీనివాస్‌రావు పనిచేస్తున్నారు. గతంలో ఉమ్మడి జిల్లా పార్టీ కార్యదర్శిగా, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడిగా, ఏఐఎస్ఎఫ్ జాతీయ అధ్యక్షుడిగా, జాతీయ ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహించారు. జాతీయ సమితి సభ్యుడిగా ఎన్నికైన ఆయనకు పార్టీ రాష్ట్ర, జిల్లా, ప్రజాసంఘాల నాయకులు అభినందనలు తెలిపారు.

ఇంటర్ విద్య ఇన్‌చార్జ్ ఆర్జేడీగా గోపాల్



విద్యారణ్యపురి: వరంగల్ ఇంటర్ విద్య ఇన్‌చార్జ్ ఆర్జేడీగా డీఐఈఓ ఎ.గోపాల్‌ను నియమిస్తూ ఇంటర్మీడియెట్ బోర్డ్ డైరెక్టర్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇంటర్ విద్య రీజినల్ జాయింట్ డైరెక్టర్‌గా, ఆర్జేడీగా కొనసాగుతున్న జయప్రదబాయిని హైదరాబాద్‌లో పూర్తిస్థాయి బోర్డ్ ఆఫ్ కంట్రోల్ ఆఫ్ ఎగ్జామినేషన్స్‌కు నియమిస్తూ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈనెల 26న గోపాల్ బాధ్యతలు స్వీకరించనున్నారు. వరంగల్ డీఐఈఓ శ్రీధర్ సుమన్‌తో పాటు కార్యాలయ సిబ్బంది రాజశేఖర్, సందీప్, కొలంబో గోపాల్‌ను సన్మానించారు.

పైసలిస్తేనే బిల్లు పాస్!



- రూ.50 వేలు చెల్లిస్తేనే ఇందిరమ్మ ఇళ్ల బిల్లులు మంజూరు
- జీడబ్ల్యూఎంసీ పరిధిలో కొందరు కార్పొరేటర్ల వసూళ్ల దందా
- ఎవరికి చెప్పుకోలేక అయోమయంలో లబ్ధిదారులు

వరంగల్ అర్బన్:

☞ గిర్మాజీపేటకు చెందిన లబ్ధిదారుకు ఇందిరమ్మ ఇల్లు మంజూరైంది. అధికారుల నుంచి ప్రొసీడింగ్ తీసుకుంది. బేస్‌మెంట్ పూర్తికావడంతో బిల్లు కావాలని అధికారులను కోరింది. కార్పొరేటర్‌ను కలవాలని వారు సలహా ఇచ్చారు. సర్ బిల్లు అని అడిగితే రూ.50 వేలు ఇస్తే బిల్లు లేకపోతే ప్రొసీడింగ్ రద్దు చేస్తామని చెప్పాడు.

☞ నాకు తెలియకుండా ఇందిరమ్మ లబ్ధిదారులకు నయాపైసా రిలీజ్ కావొద్దు అని అండర్ రైల్వే గేట్ పరిధిలోని కరీమాబాద్‌కు చెందిన ఓ కార్పొరేటర్ బెదిరింపులు.

☞ రూ.లక్షలు కుమ్మరించి గెలిచాం. ఎన్నికల సమయం దగ్గర పడింది. రూ.50 వేల చొప్పున చెల్లించాల్సిందే. లేదంటే బిల్లు ఆగుతది అని హనుమకొండకు చెందిన మరో కార్పొరేటర్ సతాయిస్తున్నాడు. ఇలా ఏదో ఒక ఏరియా.. డివిజన్‌లో కాదు.. నగర వ్యాప్తంగా ఉన్న 66 డివిజన్లలోని 50 డివిజన్ల కార్పొరేటర్లు ఇందిరమ్మ ఇళ్ల పేరిట పెద్ద ఎత్తున దోపిడీకి ద్వారాలు తెరిచారు.

☞ ఓటు వేసిన పాపానికి ఐదేళ్లు మాకీ అవస్థలు ఇంకెప్పుడు తప్పేది? అంటూ పలు డివిజన్లలోని ప్రజలు ఆవేదన చెందుతున్నారు. మరో ఏడు నెలలు గడిస్తే పదవీ కాలం పూర్తవుతోంది. ఇదేం దోపిడీ అని పేద, ప్రజలు తీవ్ర నిరాశ నిస్పృహలకు లోనవుతున్నారు. పెరిగిన ధరలు, ప్రభుత్వం మంజూరు చేసే బిల్లులకు సగానికి పైగా తేడా ఉంటోంది. అప్పోసప్పో తెచ్చి నిర్మించుకుందామనుకుంటే ఇదేం దందా అంటూ వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

గ్రేటర్‌లో 5,253 మంది లబ్ధిదారులు

నగర వ్యాప్తంగా 66వ డివిజన్లు ఉన్నాయి. మొదటి దశలో కాజీపేట సర్కిల్ పరిధిలో 2,203, కాశిబుగ్గ సర్కిల్ పరిధిలో 3,050 మంది ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులను గుర్తించి మంజూరు పత్రాలు జారీచేశారు. ప్రభుత్వ నిబంధనల మేరకు వీరిలో 15 శాతం మంది బేస్మెంట్, పిల్లర్ల లెవల్ వరకు ఇళ్లు నిర్మించుకున్నారు. వీరికి వివిధ దశల్లో బిల్లులు అందించి, ప్రోత్సహించాల్సిన బాధ్యత కార్పొరేటర్లు, అధికారులు, సిబ్బందిపై ఉంది.

అధికారులే పావులుగా..

ఏ పని జరగాలన్నా అధికారులు, సిబ్బందే కీలకం. వ్యాపార, వాణిజ్య ప్రాంతాల్లోని చిన్నచిన్న స్థలాల్లో కొంతమంది భారీ నిర్మాణాలు చేపడుతుంటారు. వీటిని ఆసరాగా చేసుకుని ఒక్కో భవనానికి ఒక్కో ధరను నిర్ణయించి వసూలు చేస్తున్నారు. అడిగినంత సొమ్ము చెల్లించకుంటే నిర్మాణాలు అక్కడితో ఆగిపోవాల్సిందే. ఇందుకోసం అధికారులను సైతం పావులుగా ఉపయోగించుకుంటున్నారు. నిర్మాణాలకు అనుమతుల జారీ వంటి అంశాల్లో కీలక పాత్ర పోషిస్తున్నారు. సందట్లో సడేమియా అన్నట్లుగా బల్దియా వార్డు ఆఫీసర్లు, ఆర్‌ఐలు తదితర విభాగాల అధికారులు మాకేం లేదా? అంటూ బెదిరింపులకు పాల్పడుతున్నారనే ఆరోపణలు వినవస్తున్నాయి. దీపం ఉండగానే ఇల్లు చక్కదిద్దుకోవాలని కొంతమంది కార్పొరేటర్లు జులుం ప్రదర్శిస్తున్నారు. ప్రజా సేవను మరిచి సొంత ఆర్థిక పురోగతికి ప్రాధాన్యమిస్తున్నారు. తన డివిజన్‌లో ఏం జరిగినా సమాచారం ఇవ్వాల్సిందేనంటూ వ్యక్తిగత సమస్యల్లో తలదూర్చుతూ డీల్‌లో భాగస్వామ్యమవుతున్నారు. తమ వాటా తమకు ముట్టజెప్పాల్సిందేనని అల్టిమేటం జారీ చేస్తున్నారు. సెటిల్‌మెంట్ల పేరిట సామాన్యులను పీల్చుకుంటున్నారు. బల్దియాలో ఇంజనీరింగ్, టౌన్‌ప్లానింగ్, శానిటేషన్ విభాగాల్లో అవినీతి ఎక్కువ. అభివృద్ధి పనులకు సంబంధించిన ఇంజనీర్ల వద్ద నుంచి మూడు నుంచి 5 శాతం కమీషన్ కార్పొరేటర్లకు ముడుతోంది. డివిజన్‌లో ఎక్కడ పునాదులు తీసినా, ఇటుక, ఇసుక పడినా, సీసీ రోడ్డు, డ్రెయినేజీ ఏ పని జరిగినా కార్పొరేటర్ల అనుచరులు వాలిపోతున్నారు. అంతేకాదు ఇంటి నంబర్లు, పేరు మార్పిడి, విభజనకు ముడుపులు చెల్లించాల్సిందే.

మంత్రి హెచ్చరించినా మారనితీరు..

బిల్లుల కోసం ఎవరైనా డబ్బులు అడిగితే ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు టోల్ ఫ్రీనంబర్ 18005995991ను సంప్రదించాలని రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. అయినప్పటికీ ఒకవైపు ప్రజాప్రతినిధులు, మరోవైపు బల్దియా అధికారులు, సిబ్బంది, చివరికి మెప్మా సీఓలు, ఆర్పీలు లబ్ధిదారుల నుంచి ఎంతోకొంత దండుకునేందుకు నానా కొర్రీలు పెడుతుండంపై విమర్శలు వస్తున్నాయి. ఈవిషయంపై బల్దియా వింగ్ అధికారులను వివరణ కోరితే తమ దృష్టికి రాలేదని, తమ పరిధిలోది కాదని దాటవేశారు.

వైన్స్ దరఖాస్తులకు వేళాయె..

నేటి నుంచి అర్జీల స్వీకరణ

- ఫీజు రూ.3 లక్షలు
- అక్టోబర్ 23న లక్కీ డ్రా.. డిసెంబర్ 1 నుంచి కొత్త మద్యం పాలసీ



వైన్స్ రిజర్వేషన్లను కేటాయించేందుకు డ్రా తీస్తున్న హనుమకొండ కలెక్టర్ స్నేహ శబరీష్, పాల్గొన్న డీసీ అంజన్‌రావు, ఈఎస్ చంద్రశేఖర్

కాజీపేట అర్బన్: రాష్ట్ర ప్రభుత్వం 2025–27 రెండేళ్ల కాలపరిమితితో వైన్స్ టెండర్లకు దరఖాస్తులు ఆహ్వానిస్తూ గురువారం ప్రకటన చేసింది. గత మద్యం పాలసీలో దరఖాస్తు రుసుము రూ.2 లక్షలు నాన్ రీఫండబుల్‌గా నిర్ణయించగా.. ఈ సారి నూతన మద్యం పాలసీలో భాగంగా దరఖాస్తు ఫీజును రూ.2 లక్షల నుంచి రూ.3 లక్షలకు పెంచింది. దీంతో ఖజానాకు వైన్స్ కిక్కు మరింత పెరిగే అవకాశం ఉంది.

ఉమ్మడి జిల్లాలో 294 వైన్స్..

ఉమ్మడి వరంగల్ జిల్లాలోని 294 వైన్స్ షాపులకు శుక్రవారం నుంచి దరఖాస్తులు ఆయా జిల్లాల కలెక్టరేట్ల పరిధిలో స్వీకరించనున్నారు. జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్‌తోపాటు సీఐ, ఎస్సైల సిబ్బంది దరఖాస్తులు స్వీకరించేందుకు అందుబాటులో ఉంటారు. రూ.3 లక్షల డీడీ లేదా చెక్కు, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోతోపాటు రిజర్వేషన్ల ప్రకారం కులధ్రువీకరణ పత్రం, ఆధార్, పాన్‌కార్డు జిరాక్స్‌లను జతపర్చి దరఖాస్తులు అందజేయాలి.

అక్టోబర్ 18వరకు దరఖాస్తుల స్వీకరణ..

వైన్స్‌షాపులను కేటాయించేందుకు అక్టోబర్ 18వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తారు. అక్టోబర్ 23న లక్కీ డ్రా ద్వారా ఆయా జిల్లాల కలెక్టర్లు వైన్ షాపులు కేటాయిస్తారు. అక్టోబర్ 23, 24 తేదీల్లో కేటాయించిన రుసుమును చెల్లించిన తర్వాత డిసెంబర్ 1వ తేదీ నుంచి నూతన వైన్‌షాపులు ప్రారంభిస్తారు.

రిజర్వేషన్లు ఇలా...

వైన్స్ కేటాయింపులో కులాల వారీగా ప్రభుత్వం రిజర్వేషన్లు కల్పించింది. గౌడలకు 10 శాతం, ఎస్సీలకు 15 శాతం, ఎస్టీలకు 5 శాతం రిజర్వేషన్లు కల్పించారు. హనుమకొండ కలెక్టర్ స్నేహ శబరీష్ లక్కీ డ్రా ద్వారా రిజర్వేషన్ల ప్రాతిపదికన కేటాయించిన వైన్స్‌లను గురువారం ఎంపిక చేశారు. కాగా, జిల్లాలోని 67 షాపులు గౌడ కులస్తులకు 15, ఎస్సీలకు 10, ఎస్టీలకు ఒక షాపు కేటాయించారు.

ఉమ్మడి వరంగల్ జిల్లాలో వైన్స్ ఇలా		
వరంగల్ అర్బన్	:	67
వరంగల్ రూరల్	:	61
మహబూబాబాద్	:	59
జనగామ	:	47
భూపాలపల్లి, ములుగు	:	60

గత పాలసీ రిపీట్...

గత పాలసీలో గడువు ఉన్న వైన్స్‌ల టెండర్లను మూడు నెలల ముందే ప్రకటించగా.. ఈ సారి అదే పాలసీ రిపీట్ అయ్యింది. డిసెంబర్ 2025 వరకు వైన్స్ గడువు ఉన్నప్పటికీ మూడు నెలల ముందే టెండర్లను ప్రకటించి గత పాలసీ సీన్‌ను రిపీట్ చేసింది.

రూరల్ నుంచి అర్బన్‌లోకి రెండు వైన్స్..

వరంగల్ రూరల్ జిల్లాలోని రెండు వైన్స్‌లు వరంగల్ అర్బన్ జిల్లాకు జీడబ్ల్యూఎంసీ పరిధిలో భాగంగా కేటాయించారు. దీంతో వరంగల్ అర్బన్‌లో గతంలో 65 వైన్స్ ఉండగా.. ఇప్పుడు ఆ సంఖ్య 67కు చేరింది. అదేవిధంగా వరంగల్ రూరల్‌లో 63 వైన్స్ ఉండగా 61కి చేరింది.

అంత్యోదయ సిద్ధాంతం గొప్పది



దీన్‌దయాళ్ ఉపాధ్యాయ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు సంతోశ్‌రెడ్డి, నాయకులు

హన్మకొండ: దీన్‌దయాళ్ ఉపాధ్యాయ సూత్రం అంత్యోదయను ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అమలు చేస్తున్నారని బీజేపీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు కొలను సంతోశ్‌రెడ్డి అన్నారు. హనుమకొండ దీన్‌దయాళ్ నగర్‌లోని బీజేపీ జిల్లా కార్యాలయంలో దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జయంతిని గురువారం నిర్వహించారు. దీన్‌దయాళ్ చిత్రపటానికి సంతోశ్‌రెడ్డి, పార్టీ నాయకులు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అంత్యోదయ సిద్ధాంతం ఎంతో గొప్పదన్నారు. ఇంటిగ్రల్ హ్యూమనిజం ఈ దేశానికి అత్యవసరమన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి జయంత్ లాల్, సీనియర్ నాయకులు డాక్టర్ కాళీప్రసాద్, డాక్టర్ విజయ్ చందర్‌రెడ్డి, రావు అమరేందర్‌రెడ్డి, నాను నాయక్, రాంబాబు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

శ్రీమహాలక్ష్మీదేవి అనుగ్రహంతో ఐశ్వర్యం



అమ్మవారికి పుష్పార్చన చేస్తున్న ఉపేంద్రశర్మ, నాయిని నీలిమ

హన్మకొండ కల్చరల్: శ్రీమహావిష్ణువు హృదయంలో కొలువైన శ్రీమహాలక్ష్మీదేవి అనుగ్రహంతో అష్ట ఐశ్వర్యాలు కలుగుతాయని వేయిస్తంభాల దేవాలయ ప్రధానార్చకుడు గంగు ఉపేంద్రశర్మ తెలిపారు. వేయిస్తంభాల ఆలయంలో జరుగుతున్న శ్రీరుద్రేశ్వరీదేవి శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా నాలుగో రోజు గురువారం అర్చకులు గంగు మణికంఠశర్మ, సందీప్‌శర్మ, ప్రణవ్ ప్రభాతసేవ, స్వామివారికి అభిషేకాలు జరిపి అమ్మవారిని శ్రీమహాలక్ష్మీదేవిగా అలంకరించి పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి సతీమణి నాయిని నీలిమ ఆధ్వర్యంలో అమ్మవారికి పుష్పార్చన నిర్వహించారు. పరమాన్నం నైవేద్యంగా నివేదన చేశారు. వేదపండితులు గుదిమెళ్ల విజయకుమారాచార్య యాగశాలలో మహాసుదర్శన హోమం, చండీహోమం చేశారు. సీఎంఆర్ షాపింగ్‌మాల్ సౌజన్యంతో భక్తులకు అన్నప్రసాదాల వితరణ చేశారు. సాయంత్రం బోడిగె లక్ష్మీనారాయణ భాగవతార్ హరికథ చెప్పారు. ఈఓ అనిల్‌కుమార్ పర్యవేక్షించారు.

చోరీలు చేసిన వారిని అరెస్ట్ చేయాలి

నెలవారీ నేర సమీక్షలో సీపీ సన్‌ప్రీత్‌సింగ్



మాట్లాడుతున్న పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్‌సింగ్

కేయూ క్యాంపస్: చోరీలు చేసిన వారిని అరెస్ట్ చేసేందుకు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేయాలని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్‌సింగ్ పోలీస్ అధికారులను ఆదేశించారు. గురువారం కాకతీయ యూనివర్సిటీలోని సెనేట్‌హాల్‌లో నిర్వహించిన నెలవారీ నేర సమీక్షలో ఆయన మాట్లాడారు. నిందితులను పట్టుకుని, చోరీలకు సంబంధించిన సొత్తు స్వాధీనం చేసుకున్నప్పుడే పోలీసులపై ప్రజలకు నమ్మకం, గౌరవం పెరుగుతుందన్నారు. నేరాల నియంత్రణకు ప్రజల భాగస్వామ్యంతో సీసీ కెమెరాల ఏర్పాటుకు కృషిచేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న కేసుల గురించి అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో ఈస్ట్‌జోన్ డీసీపీ అంకిత్‌కుమార్, వరంగల్, జనగామ ఏసీపీలు శుభం, చేతన్‌నితిన్, అదనపు డీసీపీలు రవి, ప్రభాకర్‌రావు, బాలస్వామి, సురేశ్‌కుమార్, ఏసీపీలు, ఇన్‌స్పెక్టర్లు, ఆర్‌ఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

అధ్యాపకుల చేతుల్లోనే విద్యార్థినుల భవిష్యత్

- ఇంటర్మీడియెట్ అబ్జర్వర్ వసుంధరాదేవి



జూనియర్ కళాశాలను సందర్శించిన ఇంటర్మీడియెట్ అబ్జర్వర్ వసుంధరాదేవి

హన్మకొండ: అధ్యాపకుల చేతుల్లోనే విద్యార్థినుల భవిష్యత్ ఆధారపడి ఉంటుందని ఇంటర్మీడియెట్ బోర్డు అబ్జర్వర్ వసుంధరాదేవి అన్నారు. హనుమకొండ వడ్డేపల్లిలోని ప్రభుత్వ పింగిళి బాలికల జూనియర్ కళాశాలను గురువారం ఆమె సందర్శించారు. కళాశాలలో అడ్మిషన్లు, అధ్యాపకుల వివరాలు, విద్యా బోధన అంశాలపై సమీక్షించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. కళాశాలలో 1,000 అడ్మిషన్లు కావడం అభినందనీయమని పేర్కొన్నారు. అడ్మిషన్లతోపాటు విద్యార్థినుల ఎఫ్‌ఆర్‌ఎస్ కూడా పూర్తిచేయాలని, పేరెంట్స్ టీచర్స్ సమావేశాన్ని సజావుగా నిర్వహించాలని సూచించారు. కళాశాలలో మౌలిక వసతుల కల్పనకు ఇంటర్ బోర్డు కమిషనర్ నిధులు విడుదల చేశారని వివరించారు. సమావేశంలో కళాశాల ప్రిన్సిపాల్ పి.కవిత, అధ్యాపకులు పాల్గొన్నారు.

రోజంతా వర్షం..

హన్మకొండ: హనుమకొండ జిల్లాలో గురువారం ఆకాశం మేఘావృతమై ముసురేసింది. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా మరో మూడు రోజులపాటు భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. రోజంతా ముసురు, కొన్ని చోట్ల మోస్తరు వర్షం కురిసింది. ఆటోమేటిక్ వెదర్ స్టేషన్‌లో రాత్రి 8 గంటల వరకు కురిసిన వర్షపాతం వివరాలను వాతావరణ శాఖ విడుదల చేసింది. కమలాపూర్‌లో 40 మిల్లీమీటర్లు, దామెరలో 35.8, కాజీపేటలో 31, ఎల్కతుర్తిలో 29.5, ధర్మసాగర్‌లో 29, ఆత్మకూరులో 28.5, కమలాపూర్ మండలం మరిపల్లిగూడెంలో 27.3, మడికొండలో 26, ఐనవోలులో 22.5, హసన్‌పర్తి మండల చింతగట్టులో 21.5, నాగారంలో 20.8, నడికూడలో 18.8, కొండపర్తిలో 18, పెద్దపెండ్యాలలో 14.5, శాయంపేటలో 13.3, పరకాలలో 10.8, దామెర మండలం పులుకుర్తిలో 5.8 మిల్లీమీటర్ల వర్షం కురిసింది.

సొసైటీ సభ్యులకు చెక్కుల పంపిణీ



చెక్కులు అందిస్తున్న ఎంపీ కడియం కావ్య

హన్మకొండ: గ్రామీణ తపాలా ఉద్యోగుల కో–ఆపరేటివ్ సొసైటీ సభ్యులకు ఆర్థిక సాయం చెక్కులను వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య పంపిణీ చేశారు. గురువారం హనుమకొండ కనకదుర్గ కాలనీలోని స్వగృహంలో జరిగిన కార్యక్రమంలో కో–ఆపరేటివ్ సభ్యుల మృతుల కుటుంబాలకు ఆర్థిక సాయం కింద రూ.50 వేల చొప్పున ఎంపీ కడియం కావ్య చేతుల మీదుగా కె.రత్నకుమారి, ఊకే బుచ్చయ్య కుటుంబ సభ్యులు కె.భాస్కర్, ఊకే కన్నక్కకు అందించారు. ఎంపీ కడియం కావ్య మాట్లాడుతూ.. గ్రామీణ తపాలా ఉద్యోగుల సంక్షేమం కోసం సహకార సంఘాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. సొసైటీ అధ్యక్షుడు బొడ్డున వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. గ్రామీణ తపాలా ఉద్యోగుల సంక్షేమమే లక్ష్యంగా తమ సొసైటీ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సొసైటీ కార్యదర్శి మర్రి కొమురారెడ్డి, డైరెక్టర్లు పెరుమామిళ్ల తిరుపతి, ఎం.మనోహర్, బి.వెంకటేశ్, బాపూజీ, పిట్టల అశోక్, చాడ జైహింద్ రెడ్డి, పి.శ్రీలత, ఎండీ అజీజ్ పాల్గొన్నారు.

బతుకమ్మ వేడుకలను జయప్రదం చేయాలి

- బీఆర్‌ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్



సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్

హన్మకొండ: బాలసముద్రంలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో ఈనెల 28న బతుకమ్మ వేడుకలు నిర్వహించనున్నట్లు ఆ పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్ తెలిపారు. గురువారం పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. బతుకమ్మ పండుగ తెలంగాణ అస్తిత్వానికి చిహ్నం అని అన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో బతుకమ్మ పండుగను మహిళలు ఎంతో గౌరవంగా జరుపుకునేవారని తెలిపారు. అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ ఆడపడుచులకు బతుకమ్మ కానుకలు ఇచ్చారని గుర్తుచేశారు. మాజీ మంత్రి సత్యవతిరాథోడ్, మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మా దేవేందర్‌రెడ్డి, మాజీ విప్ గొంగిడి సునీత, కరీంనగర్ జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ తుల ఉమ హాజరయ్యే వేడుకలను జయప్రదం చేయాలని ఆయన కోరారు. కార్పొరేటర్ ఇమ్మడి లోహిత రాజు, మహిళా నాయకులు డాక్టర్ హరిరామదేవి, జ్యోతి యాదవ్, విజయ, లత, సరస్వతి, మణి, హైమావతి, పూర్ణిమ, శ్వేత, అంజలీదేవి, శ్రీలత, విజయలక్ష్మి, అరుంధతి, స్నేహలత, రమ, పావని, విజయ పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమి కబ్జాకు యత్నం



భూమిని పరిశీలిస్తున్న తహసీల్దార్ ఇక్బాల్

ఖిలా వరంగల్: చారిత్రక ప్రసిద్ధి చెందిన ఉర్సుగుట్ట చుట్టూ ఉన్న విలువైన భూములు అన్యాక్రాంతమవుతున్నాయని ఆరోపణలున్నాయి. గుట్ట సుమారు 29 ఎకరాల విస్తీర్ణంలో ఉంటోంది. దీనికి ఆనుకుని ఉన్న 355 సర్వే నంబర్‌లో ఎకరం ప్రభుత్వం భూమి ఉంది. గతంలోనే రెవెన్యూ అధికారులు సర్వే చేసి ప్రభుత్వ భూమిగా గుర్తించారు. దీనిపై కలెక్టర్ స్పందించి ప్రహరీ నిర్మించాలని ఉత్తర్వులు జారీ చేశారు. పనులు ఆలస్యం కావడం.. నగరంలోని ఓ బడా వ్యాపారి గురువారం తన భూమి పక్కనే ఉన్న ప్రభుత్వ భూమిని కొంత మేర కలిపేసుకునే ప్రయత్నంలో భాగంగా జేసీబీతో చదును చేసే పనులు చేపట్టారు. స్థానికులు గమనించి తహసీల్దార్‌కు సమాచారం ఇచ్చారు. హుటాహుటిన తహసీల్దార్ ఇక్బాల్ సిబ్బందితో 355 సర్వే నంబర్ భూమి వద్దకు చేరుకుని భూమిని పరిశీలించారు. ఏడీ సర్వే అయ్యే వరకు ఎలాంటి నిర్మాణాలు, పనులు చేపట్టవద్దని హెచ్చరిస్తూ సదరు వ్యక్తికి నోటీసులు జారీ చేశారు. జేసీబీ యంత్రాన్ని అక్కడి నుంచి పంపించారు.

కలెక్టరేట్‌లో ప్రక్షాళన

- జీ6 విభాగాన్ని పరిశీలించిన అదనపు కలెక్టర్
- సీనియర్ అసిస్టెంట్ డిప్యుటేషన్ రద్దు
- చాంబర్ తొలగించిన అధికారులు


తొలగించక ముందు ఏ-సెక్షన్ చాంబర్


తొలగిస్తున్న చాంబర్

సాక్షి ఎఫెక్ట్..

హన్మకొండ అర్బన్: కలెక్టరేట్‌లోని రెవెన్యూ శాఖలో ఇటీవల జరుగుతున్న పరిణామాల నేపథ్యంలో సాక్షి దినపత్రికలో వస్తున్న వరుస కథనాలు సంచలనం రేపుతున్నాయి. వరుస ఘటనలతో వార్తల్లోకి ఎక్కిన పరిపాలన కేంద్రంలో ఎట్టకేలకు అధికారులు దిద్దుబాటు చర్యలకు సిద్ధమయ్యారు. గురువారం కలెక్టరేట్‌లోని ఏ సెక్షన్ కార్యకలాపాలు సాగించే జీ6 విభాగాన్ని అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి సందర్శించారు. అక్కడ సిబ్బంది పనిచేస్తున్న విధానం, ఏ-సెక్షన్ చాబర్‌ను పరిశీలించారు. చాంబర్‌ను వెంటనే తొలగించాలని కలెక్టరేట్ ఏఓను ఆదేశించారు. అదేవిధంగా సెక్షన్‌లో ఎవరు ఉన్నది, ఏం జరుగుతుంది బయటకు కనిపించేలా ఏర్పాట్లు చేయాలని ఆదేశించడంతో పనులు మొదలయ్యాయి. ఏ సెక్షన్ చుట్టూ పెట్టని కోటలా నిర్మించుకున్న చాంబర్‌ను అధికారులు పూర్తిగా తొలగించారు.

డిప్యుటేషన్ రద్దు

ప్రాథమిక చర్యల్లో భాగంగా తీవ్ర ఆరోపణలు ఎదుర్కొంటున్న ఏ సెక్షన్ సీనియర్ అసిస్టెంట్ ఇర్ఫాన్ సోహియల్‌ను ఎస్సారెస్పీకి పంపిన అధికారులు.. తాజాగా అదే ఏ సెక్షన్‌లో విధులు నిర్వర్తిస్తున్న సీనియర్ అసిస్టెంట్ కృపావతి డిప్యుటేషన్ రద్దుచేసి తన పాత స్థానంలో రిపోర్ట్ చేయాలని ఆదేశించారు. కృపావతి వాస్తవ పోస్టు వేలేరు మండలం ఆర్ఐగా విధులు నిర్వర్తించాల్సి ఉంది. ప్రస్తుతం ఉన్నతాధికారుల ఆదేశాలతో ఆమె డిప్యూటేషన్ రద్దయింది. వేలేరులో రిపోర్టు చేయనున్నారు. అదేవిధంగా మిగిలిన డిప్యుటేషన్లపై కూడా అధికారులు విచారణ జరపాలని ఉద్యోగులు కోరుతున్నారు.

అధికారులకు చేరిన నివేదిక..

కలెక్టరేట్‌లో కామాంధుడి ఘటనపై కలెక్టర్ ఐసీసీ కమిటీ ఏర్పాటు చేశారు. కాస్త ఆలస్యంగానైనా కమిటీ నివేదిక సమర్పించిందని ఉద్యోగులు పేర్కొంటున్నారు. బాధితులు, నిందితులతోపాటు సాక్షుల నుంచి కూడా లిఖితపూర్వకంగా కమిటీ వివరాలు సేకరించింది. ఆ వివరాల ప్రకారం ఏ చర్యలు తీసుకోవాలో ఉన్నతాధికారులకు నివేదిక సమర్పించింది. ఈ నివేదిక ఆధారంగా కలెక్టర్ చర్యలు తీసుకోనున్నట్లు తెలుస్తోంది. సంచలనం రేపిన ఈ ఘటనపై నివేదికలో ఏముంది, కలెక్టర్ ఎలాంటి చర్యలు తీసుకుంటారన్న దానిపై ఉద్యోగుల్లో సర్వత్రా ఉత్కంఠ నెలకొంది

బొగ్గు ఉత్పత్తికి అంతరాయం


ఓపెన్‌కాస్టులోకి చేరిన వర్షపు నీరు

భూపాలపల్లి అర్బన్: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షం కారణంగా గురువారం భూపాలపల్లి ఏరియాలోని ఓపెన్ కాస్టు గనుల్లో బొగ్గు ఉత్పత్తికి అంతరాయం ఏర్పడింది. ఏరియాలోని కేటీకే ఓపెన్ కాస్టు -2,3 ప్రాజెక్టుల్లో మూడు షిఫ్టుల్లో బొగ్గు ఉత్పత్తి నిలిచిపోయింది. ఓపెన్‌కాస్టు ప్రాజెక్టుల్లోని పని స్థలాల్లో వర్షపు నీరు వచ్చి చేరింది. గని ఆవరణలో రోడ్లు బురదగా మారాయి. దీంతో సుమారు 8 వేల టన్నుల బొగ్గు ఉత్పత్తికి అంతరాయం ఏర్పడింది. ఓపెన్‌కాస్టులో చేరిన వర్షపు నీటిని భారీ మోటార్లు ఏర్పాటు చేసి బయటకు ఎత్తిపోస్తున్నారు.

లక్ష్య సాధకులు..

ప్రస్తుత పోటీ ప్రపంచంలో ప్రభుత్వ ఉద్యోగం సాధించడం ఆషామాషీ కాదు. దీనికి కఠోర తపస్సు చేయాలి. క్షేత్ర స్థాయి నుంచి మొదలు.. ఉన్నత స్థాయి వరకు పోస్టులు వందల్లో ఉంటే దరఖాస్తులు లక్షల్లో ఉంటున్నాయి. ఈ తరుణంలో అర మార్కు కూడా అత్యంత విలువైంది. అందుకే విజయం వరించాలంటే పుస్తకాలతో నిత్యం కుస్తీ పట్టాలి.. దోస్తీ కట్టాలి. క్షణం కూడా వృథా చేయకుండా లక్ష్యం వైపు సాగాలి. అప్పుడే విజేతలుగా నిలుస్తాం. సరిగ్గా ఇదే సూత్రాన్ని పాటించిన ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన పలువురు అభ్యర్థులు బుధవారం అర్ధరాత్రి తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ ప్రకటించిన గ్రూప్-1 ఫలితాల్లో విజేతలుగా నిలిచారు. పలు ఉన్నత స్థాయి కొలువులను దక్కించుకున్నారు. వారి విజయగాథలపై ప్రత్యేక కథనం..

అసిస్టెంట్ ట్రెజరీ ఆఫీసర్‌గా పవన్‌కల్యాణ్..



గార్ల: మండలంలోని పెద్దకిష్టాపురం గ్రామానికి చెందిన గంగావత్ పవన్‌కల్యాణ్ గ్రూప్-1లో అసిస్టెంట్ ట్రెజరీ ఆఫీసర్‌గా ఎంపికయ్యారు. కాగా, పవన్‌కల్యాణ్ హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో ఒకటి నుంచి ఇంటర్ వరకు, ఢిల్లీ యూనివర్సిటీలో బీఏ పూర్తి చేశారు. మొదటి ప్రయత్నంలోనే గ్రూప్-1లో 454 మార్కులు సాధించి ఎస్టీ విభాగంలో 527వ ర్యాంకు పొంది ట్రెజరీ ఆఫీసర్‌గా ఎంపికయ్యారు. ఉద్యోగం చేస్తూనే సివిల్స్‌లో ఐఏఎస్ సాధించడమే తన లక్ష్యమన్నారు.

రిటైర్డ్ ఎస్సై కుమారుడికి ర్యాంకు..



ఖిలా వరంగల్: వరంగల్ అబ్బనికుంటకు చెందిన రిటైర్డ్ ఎస్సై మున్నీరుల్లా కుమారుడు ఎండీ రహిమతుల్లా గ్రూప్-1లో ఉత్తమ ర్యాంకు సాధించి ఎంపీడీఓ ఉద్యోగానికి ఎంపికయ్యారు. మునీరుల్లా మిల్స్‌కాలనీ పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై గా విధులు నిర్వర్తిస్తూ ఇటీవల రిటైర్డ్ అయ్యారు. మొదటి నుంచి రహిమతుల్లా పట్టుదల, క్రమశిక్షణతో చదివి ఎంపీడీఓగా ఉద్యోగం దక్కించుకున్నాడు. దీంతో తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా తేజస్వినిరెడ్డి..



గార్ల/శాయంపేట: గార్ల ఎంపీఓ జె. తేజస్వినిరెడ్డి గ్రూప్-1లో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ పోస్టుకు ఎంపికయ్యారు. 532.5 మార్కులు సాధించి స్టేట్ 4వ ర్యాంకు సాధించారు. దీంతో తేజస్వినిరెడ్డిని ఎంపీడీఓ మంగమ్మ, తహసీల్దార్ శారద, సీనియర్ అసిస్టెంట్ రాజేశ్, సూపరింటెండెంట్ ఉదయశ్రీ, కార్యాలయ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

కమర్షియల్ ట్యాక్స్ ఆఫీసర్‌గా వైష్ణవి..



రాయపర్తి: మండలంలోని పెర్కవేడు గ్రామానికి చెందిన పుల్లూరి రఘుబాబు, నాగరాణి దంపతుల పెద్ద కుమార్తె వైష్ణవి గ్రూప్-1లో 120 ర్యాంకు సాధించి కమర్షియల్ ట్యాక్స్ ఆఫీసర్ పోస్టుకు ఎంపికయ్యారు. వైష్ణవి.. ఇంటర్మీడియట్ హైదరాబాద్‌లోని శ్రీచైతన్య ఐఏఎస్ అకాడమీలో, డిగ్రీ మెరండ హౌజ్ ఢిల్లీ యూనివర్సిటీలో చదివారు. కాగా, వైష్ణవికి తల్లిదండ్రులతోపాటు గ్రామస్తులు శుభాకాంక్షలు తెలిపారు. వీరు ప్రస్తుతం వరంగల్ కాశిబుగ్గ లక్ష్మీపురంలో నివాసం ఉంటున్నారు.

గ్రేడ్-2 మున్సిపల్ కమిషనర్‌గా ఉదయ్‌కుమార్



రఘునాథపల్లి: మండల కేంద్రానికి చెందిన కొయ్యడ ఉదయ్‌కుమార్ గ్రూప్-1 ఫలితాల్లో గ్రేడ్-2 మున్సిపల్ కమిషనర్ ఉద్యోగం సాధించారు. నిరుపేద కుటుంబానికి చెందిన కొయ్యడ ప్రభాకర్- లక్ష్మి దంపతుల పెద్ద కుమారుడు ఉదయ్‌కుమార్ రఘునాథపల్లి తేజస్వి స్కూల్‌లో పదో తరగతి వరకు, స్టేషన్‌ఘన్‌పూర్‌లో పాలిటెక్నిక్ , ఘట్‌కేసర్ విజ్ఞాన భారతిలో బీటెక్, నిజాంకాలేజీలో ఎంబీఏ పూర్తి చేశారు. కాగా, గతేడాది డిసెంబర్‌లో సింగరేణిలో పర్సనల్ మేనేజర్ ఉద్యోగం సాధించి విధులు నిర్వర్తిస్తున్నారు.

ఎంపీడీఓగా తరుణ్‌ప్రసాద్..



నయీంనగర్/కేయూ క్యాంపస్: గ్రేటర్ వరంగల్ 54వ డివిజన్ శ్రీనగర్ కాలనీకి చెందిన రావుల జగదీశ్వర్ ప్రసాద్, శ్రీదేవి దంపతుల కుమారుడు తరుణ్‌ప్రసాద్ ఎంపీడీఓ పోస్టుకు ఎంపికయ్యారు. తరుణ్‌ప్రసాద్ కిట్స్ వరంగల్‌లో బీటెక్ పూర్తిచేసి గ్రూప్-1 కు ప్రిపేర్ అవుతూ మొదటి ప్రయత్నంలోనే విజయం సాధించారు. ఈ సందర్భంగా తల్లిందడ్రులు, బంధుమిత్రులు తరుణ్‌ప్రసాద్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

డీఎస్పీగా దైనంపల్లి ప్రవీణ్..



ఏటూరునాగారం: మండల కేంద్రంలోని మానసపల్లికి చెందిన దైనంపల్లి ప్రవీణ్‌కుమార్‌కు తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) నిర్వహించిన గ్రూప్-1 పరీక్షల్లో 105 ర్యాంకు సాధించారు. మల్టీజోన్-1లో డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ (డీఎస్పీ) పోస్టుకు ఎంపికయ్యారు. కాగా, ప్రవీణ్ ప్రస్తుతం యూపీఎస్సీ మెయిన్స్ కూడా రాసి ఆ ఫలితాల కోసం ఎదురుచూస్తున్నారు.

ఎంపీడీఓగా సుధీర్..



ఎల్కతుర్తి: టీజీపీఎస్సీ గ్రూప్-1 ఫలితాల్లో భీమదేవరపల్లి మండలం ధర్మారం గ్రామానికి చెందిన బొక్క జయ-సుధాకర్ కుమారుడు సుధీర్ 437.5 మార్కులతో ఎంపీడీఓ ఉద్యోగం సాధించారు. హుస్నాబాద్ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్‌లో పదో తరగతి, హనుమకొండలో ఇంటర్, హుజూరాబాద్‌లో బీటెక్ పూర్తి చేశారు. 2023లో సింగరేణిలో జూనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగం సాధించారు. ఇంటి వద్ద ప్రిపేరై మొదటి ప్రయత్నంలోనే గ్రూప్-1లో ఎంపీడీఓ ఉద్యోగం సాధించారు.

మున్సిపల్ కమిషనర్‌గా రాజశేఖర్‌రెడ్డి..



బచ్చన్నపేట: మండల కేంద్రానికి చెందిన చిమ్ముల రాజశేఖర్‌రెడ్డి గ్రూప్-1లో మున్సిపల్ కమిషనర్ పోస్టుకు ఎంపికయ్యారు. రాజశేఖర్‌రెడ్డి పదో తరగతి బచ్చన్నపేట ప్రభుత్వ పాఠశాలలో, ఇంటర్మీడియట్ ఏపీఆర్‌జేసీ నిమ్మకూర్‌లో, బీటెక్ రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నంలో పూర్తి చేశారు. 2014లో ఏపీపీఎస్సీలో పంచాయతీ కార్యదర్శిగా ఎంపికైన రాజశేఖర్‌రెడ్డి 2024లో గ్రూప్-4లో 279 ర్యాంకు సాధించారు. గ్రూప్-2లో 424 మార్కులు సాధించి రాష్ట్ర 8వ ర్యాంకర్‌గా నిలిచారు. ఈ సందర్భంగా తల్లిదండ్రులు చిమ్ముల అరుణ, మల్లారెడ్డితోపాటు గ్రామస్తులు రాజశేఖర్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు.

ఏసీబీ వలలో సైట్ ఇంజనీర్ రమేశ్

- రూ. 8వేల లంచం తీసుకుంటుండగా పట్టుకున్న అధికారులు


ఏసీబీకి పట్టుబడిన సైట్ ఇంజనీర్ సామల రమేశ్

విద్యారణ్యపురి: తెలంగాణ రాష్ట్ర విద్య, మౌలిక సదుపాయాల సంస్థ (టీజీఈడబ్ల్యూ ఐడీసీ)జనగామ సబ్ డివిజన్ సైట్ ఇంజనీర్ (ఔట్ సోర్సింగ్) సామల రమేశ్ లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కారు. హనుమకొండ డీఈఓ కార్యాలయంలోని జనగామ సబ్ సబ్ డివిజన్ ఆఫీస్‌లో గురువారం ఓ కాంట్రాక్టర్ నుంచి రూ. 8వేల లంచం తీసుకుంటూ అవినీతి నిరోధకశాఖ అధికారుల(ఏసీబీ)కు రెడ్‌హ్యాండెండ్‌గా పట్టుబడ్డాడు. ఏసీబీ అధికారుల కథనం ప్రకారం.. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని జనగామ జిల్లా కొడకండ్ల జెడ్పీహెచ్ఎస్‌కు పీఎం శ్రీ పథకం కింద సైన్స్‌ల్యాబ్‌కు రూ. 13లక్షల 50వేలు మంజూరు కాగా గది నిర్మించారు. ఆ నిర్మాణం చేయించినవారికి ఇప్పటికే కొంత బిల్లు ముట్టింది. ఫైనల్ బిల్లు కింద రూ. 3లక్షల 50వేలు చెల్లించాల్సిండగా ఆ బిల్లు ప్రాసెస్ చేసేందుకు ఫార్వర్డ్ చేయడానికి సైట్‌ఇంజనీర్ సామల రమేశ్.. ఆ సైన్స్‌ల్యాబ్ గదిని నిర్మించిన వ్యక్తిని రూ. 18వేల లంచం డిమాండ్‌చేశారు.ఆ వ్యక్తి తొలుత రూ. 10వేలు ఫోన్ పే ద్వారా సైట్ ఇంజనీర్ రమేశ్‌కు కొద్దిరోజుల క్రితం చెల్లింపు చేశారు. మిగతా రూ. 8వేలు చెల్లిస్తేనే ఫైనల్ బిల్లు చెల్లింపునకు సంబంధించి ప్రక్రియ పూర్తవుతందని రమేశ్ చెప్పడంతో అతను (ఫిర్యాదుదారుడు) ఏసీబీ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో గురువారం హనుమకొండ డీఈఓ కార్యాలయంలోని టీజీఈడబ్ల్యూ ఐడీసీ జనగామ సబ్‌డివిజన్ ఆఫీస్‌లోనే సైన్స్ ల్యాబ్‌ను నిర్మాణం చేయించిన వ్యక్తి నుంచి రూ.8వేల లంచం తీసుకుంటుండగా ఏసీబీ డీఎస్పీ సాంబయ్య, ఇద్దరు ఇన్‌స్పెక్టర్లు ఎల్ రాజు, ఎస్‌రాజు.. రమేశ్‌ను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అనంతరం జనగామ సబ్‌డివిజన్ టీజీఈడబ్ల్యూ ఐడీసీ కార్యాలయంలో సోదాలు కొనసాగించారు. పలు రికార్డులు పరిశీలించారు. రమేశ్ వరంగల్ ప్రాంతానికి చెందిన వ్యక్తని, అతడిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరుస్తామని ఏసీబీ అధికారులు తెలిపారు. కాగా, రమేశ్ ఏసీబీ అధికారులకు పట్టుబడటంతో ఆ ఇంజనీరింగ్ విభాగంలోని వివిధ జిల్లాల అధికారుల్లో గుబులు రేపుతోంది.

మావోయిస్టు దళ సభ్యుడి లొంగుబాటు?

హసన్‌పర్తి: హసన్‌పర్తి మండలం వంగపహాడ్‌కు చెందిన మావోయిస్టు దళ సభ్యుడు పోలీసుల ఎదుట లొంగిపోయినట్లు తెలిసింది. ప్రస్తుతం అతడు ఛత్తీస్‌గఢ్‌లో దళ సభ్యుడిగా పనిచేస్తున్నట్లు సమాచారం. అతడిపై ప్రభుత్వం రివార్డు ప్రకటించింది. వంగపహాడ్‌కు చెందిన అతడు బాల్యంలో పశువుల కాపరిగా పనిచేసే వాడు..అయితే విప్లవసాహిత్యానికి ఆకర్షితుడై 40ఏళ్ల క్రితం పొరుబాట పట్టినట్లు స్నేహితులు చెబుతున్నారు. అజ్ఞాతంలోకి వెళ్లిన అతడు ఇప్పటి వరకూ వంగపహాడ్‌కు రాలేదని స్థానికులు తెలిపారు.

మండలంలో మావోయిస్టు కేడర్ సమాప్తం..

హసన్‌పర్తి మండలంలో 20 మంది వరకు విప్లవసాహిత్యానికి ఆకర్షితులై పొరుబాట పట్టారు. క్రమేణ ఒక్కొక్కరు పోలీసులు ఎదుట లొంగిపోయారు. చివరికి చింతగట్టుకు చెందిన రాకేశ్‌తోపాటు వంగపహాడ్‌కు చెందిన వ్యక్తి మాత్రం ఛత్తీస్‌గఢ్ ఏరియాలో పనిచేస్తున్నారు. అయితే ఇటీవల ఛత్తీస్‌గఢ్‌లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో రాకేశ్ మృతిచెందగా వంగపహాడ్‌కు చెందిన మరో దళ నాయకుడు మావోయిస్టు పార్టీలో కొనసాగుతున్నాడు. చివరికి అతడు కూడా రాష్ట్ర పోలీస్ ఉన్నతాధికారుల ఎదుట లొంగిపోయినట్లు సమాచారం. ఈవిషయం వంగపహాడ్‌లో చర్చనీయాంశంగా మారింది.

గంజాయి మత్తులో యువకుడి హల్‌చల్

- లక్ష్మి టౌన్‌షిప్‌లో అధ్యక్షుడి ఇంటిపై దాడి
- ప్రధాన ద్వారం వద్ద గొడ్డలితో బాటసారులపై దాడికి యత్నం
- ఇంతేజార్‌గంజ్ పీఎస్‌లో కేసు నమోదు

రామన్నపేట : గంజాయి మత్తులో ఓ యువకుడు హల్‌చల్ చేశాడు. వరంగల్ లక్ష్మి టౌన్‌లో షిప్‌లో అధ్యక్షుడి ఇంటిపైదాడి చేయడమే కాకుండా దారి కాచి బాటసారులపై సైతం గొడ్డలితో దాడికి యత్నించాడు. ఈ ఘటన బుధవారం రాత్రి చోటు చేసుకుంది. కాలనీ వాసుల కథనం ప్రకారం.. దేశాయిపేట ఎస్.పి. ఆర్‌నగర్‌కు చెందిన కందుకూరి హరి గంజాయి మత్తులో రాత్రి 7.03 సమయంలో టౌన్‌లో షిప్‌లో అధ్యక్షుడు కొడకండ్ల రామచంద్రమూర్తి ఇంటిపై దాడికి పాల్పడ్డాడు. వెంటనే స్థానికులు అప్రమత్తం కావడంతో వెళ్లిపోయాడు. మళ్లీ రాత్రి 9 గంటలకు బండను వారిపై వేయడానికి యత్నించగా మోష్ డోర్ పెట్టడంతో పెను ప్రమాదం తప్పింది. అనంతరం రాత్రి 11 గంటల సమయంలో టౌన్ షిప్ ప్రధాన ద్వారం వద్ద గొడ్డలితో వచ్చే వారిపై దాడి చేయడానికి యత్నించే క్రమంలో కాలనీ వాసులు మూకుమ్మడిగా దాడికి దిగడంతో పైడిపల్లి వైపు పరుగులు తీశారు. అనంతరం ఈ గొడ్డలిని పోలీస్‌స్టేషన్‌లో అప్పగించినట్లు కాలనీవాసులు తెలిపారు. ఈ ఘటనపై బాధితుడు రామచంద్రమూర్తి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ షుకూర్ గురువారం తెలిపారు.

ఆర్టీసీ ప్రయాణికులకు బహుమతులు

హన్మకొండ: దసరా పండుగ సందర్భంగా టీజీఎస్ ఆర్టీసీ ఆకర్షణీయమైన బహుమతులను ప్రకటించింది. ఈ నెల 27 నుంచి అక్టోబర్ 6 వరకు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే వారికి లక్కీ డ్రా ద్వారా బహుమతులు అందించనుంది. ఆర్టీసీ సెమీ డీలక్స్, డీలక్స్, మెట్రో డీలక్స్, సూపర్ లగ్జరీ, లహరి నాన్ ఏసీతోపాటు అన్ని ఏసీ బస్సుల్లో ప్రయాణించేవారు ఈ లక్కీ డ్రాకు అర్హులు. వరంగల్ రీజియన్ పరిధిలో డ్రా తీసి ముగ్గురికి బహుమతులు అందించనున్నారు. మొదటి బహుమతి రూ.25 వేలు, ద్వితీయ బహుమతి రూ.15 వేలు, తృతీయ బహుమతి రూ.10 వేలుగా ప్రకటించింది. ప్రయాణికులు టికెట్ వెనుక వైపు పేరు, ఫోన్ నంబర్, చిరునామా రాసి బస్ స్టేషన్లలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన బాక్స్‌ల్లో వేయాలి. వరంగల్ రీజియన్‌లోని హనుమకొండ, వరంగల్, ములుగు, ఏటూరునాగారం, నర్సంపేట, మహబూబాబాద్, తొర్రూరు, జనగామ, పరకాల, భూపాలపల్లి, ఉప్పల్ బస్టాండ్‌లో ప్రత్యేక బాక్స్‌లను ఆర్టీసీ అధికారులు ఏర్పాటు చేస్తున్నారు. ఈ బాక్స్‌ల్లో వేసిన టికెట్లను ఒక చోటుకు చేర్చి వరంగల్ రీజియన్ స్థాయిలో డ్రా తీసి విజేతలను ప్రకటించి నగదు బహుమతి అందిస్తారు.

ఆర్టీసీ బస్సుల్లోనే ప్రయాణించాలి



సుఖవంతమైన, సురక్షిత ప్రయాణానికి ఆర్టీసీ బస్సుల్లోనే ప్రయాణించాలి. బతుకమ్మ, దసరా పండుగ ప్రయాణికులకు ఇబ్బంది కలుగకుండా ఉండేందుకు ప్రత్యేక బస్సులు నడుపుతున్నాం. రద్దీని బట్టి అప్పటికప్పుడు బస్సులు సమకూరుస్తున్నాం. బస్టాండ్లలో డిపో స్థాయి అధికారిని పర్యవేక్షకుడిగా నియమించి ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకున్నాం. ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించి లక్కీ డ్రాలో ప్రయాణికులు బహుమతులు గెలుచుకోవాలి.

-డి.విజయభాను, ఆర్ఎం వరంగల్

గుండా ప్రకాశ్‌రావుకు జ్యుడీషియల్ రిమాండ్

- పరకాల సబ్ జైలుకు తరలింపు

వరంగల్ లీగల్ : డిపాజిట్‌దారులను మోసగించిన కేసులో భవిత శ్రీ చిట్‌ఫండ్ చైర్మన్, జీడబ్ల్యూఎంసీ మాజీ మేయర్ గుండా ప్రకాశ్‌రావుకు 14 రోజుల (అక్టోబర్ 09 వరకు) జ్యుడీషియల్ రిమాండ్ విధిస్తూ హనుమకొండ మొదటి మున్సిఫ్ కోర్టు ఇన్‌చార్జ్ జడ్జి సీహెచ్ శ్రావణ స్వాతి గురువారం ఆదేశాలు జారీ చేశారు. భవిత శ్రీ చిట్‌ఫండ్‌లో డిపాజిట్‌దారుడైన పరకాల మండల కేంద్రానికి చెందిన వంగాల పరమానందం అనే వ్యక్తిని చిట్టీ సమయం అయిపోయినా తనకు ఇవ్వాల్సిన డబ్బులు రూ.1,60,89,768 చెల్లించకుండా ప్రకాశ్‌రావు కాలయాపన చేస్తూ మోసగించాడు. దీంతో బాధితుడు హనుమకొండలోని చిట్‌ఫండ్ ప్రధాన కార్యాలయానికి వెళ్లగా సంబంధిత వ్యక్తులు, గుర్తుతెలియని వ్యక్తులు ఆయనను బయటకు వెళ్లగొట్టారు. ఈ విషయం ఎక్కడైనా ఫిర్యాదు చేస్తే చంపేస్తామని బెదిరించారు. రూ.37.50 లక్షల చొప్పున మూడు విడతలుగా చెల్లిస్తామని చెప్పి మొదటి విడత చెల్లించారు. తదుపరి మిగతా డబ్బుల కోసం అడగగా ఎలాంటి సమాధానం చెప్పకుండా మోసగిస్తూ బెదిరింపులకు పాల్పడ్డారు. దీంతో బాధితుడు పరమానందం హనుమకొండ పోలీస్‌స్టేషన్‌లో 2024 అక్టోబర్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేశారు. గురువారం ప్రకాశ్‌రావును అరెస్ట్ చేసి హనుమకొండ మొదటి మున్సిఫ్ మేజిస్ట్రేట్ కోర్టులో హాజరుపర్చారు. జడ్జి సీహెచ్ శ్రావణ స్వాతి 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించగా పరకాల సబ్ జైలుకు తరలించారు.

పసిపాప విక్రయ కేసులో నలుగురి అరెస్ట్

నర్సంపేట: పసిపాపను విక్రయించిన కేసులో నలుగురిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు నెక్కొండ సీఐ శ్రీనివాస్ గురువారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. చెన్నారావుపేట మండలంలోని టేకులకుంటతండాకు చెందిన వాంకుడోతు యాకూబ్ భార్య మౌనిక జూలై 17న నర్సంపేట ఏరియా ఆస్పత్రిలో ఆడశిశువుకు జన్మించింది. ఈనెల 18 నుంచి పాప ఇంటి వద్ద కనిపించకపోవడంతో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ హేమలత చెన్నారావుపేట పోలీస్‌స్టేషన్‌లో ఈనెల 21న ఫిర్యాదు చేసింది. వెంటనే ఎస్సై రాజేశ్‌రెడ్డి కేసు నమోదు చేసుకుని విచారణ చేపట్టారు. మూడో సంతానంగా పుట్టిన పసిపాను వాంకుడోతు యాకూబ్, మౌనిక దంపతులు రూ.50 వేలకు కరీంనగర్‌కు చెందిన తాడూరి రవి, కల్పనకు విక్రయించారు. వెంటనే పసిపాను చైల్డ్‌వెల్ఫేర్ కమిటీకి అప్పగించి, యాకూబ్, మౌనిక దంపతులు, పాపను కొనుగోలు చేసిన రవి-కల్పన దంపతులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

నాటకాలు ఇతిహాసాల్ని తెలియజేస్తాయి

- మాజీ స్పీకర్, ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి
- ఆకట్టుకున్న'మమ్మల్ని బతకనివ్వండి', 'జగదేకసుందరి సామా' నాటక ప్రదర్శనలు
- ముగిసిన నాటకోత్సవాలు


నాటకోత్సవాలను ప్రారంభిస్తున్న అతిథులు

హన్మకొండ కల్చరల్: నాటకాలు ఇతిహాసాలను తెలియజేస్తాయని, నాటకాలను చూసే రామాయణ మహాభారత ఇతివృత్తాలను తెలుసుకునేవాళ్లమని తెలంగాణ రాష్ట్ర మాజీ స్పీకర్, ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి అన్నారు. తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ, ఎఫ్‌డీసీ వారి ఆధ్వర్యంలో మూడురోజుల పాటు నిర్వహిస్తున్న పందిళ్ల శేఖర్‌బాబు స్మారక నాటకోత్సవం-2025 ముగిశాయి. ఈమేరకు గురువారం సాయంత్రం నాటక సమాజాల రాష్ట్ర అధ్యక్షుడు ఆకుల సదానందం, వనం లక్ష్మీకాంతారావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మధుసూదనాచారి, వీనస్ ఐటీఐ అధినేత శ్రీరామోజు సుందరమూర్తి, అడిషనల్ డీసీపీ నల్లమల రవి, ఆర్యవైశ్య నాయకులు గట్టు మహేశ్‌బాబు ముఖ్య అతిథులుగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి మాట్లాడారు. సమాజంలో చైతన్యం కలిగించడం అనేది నాటకాలు, పాటల వల్లనే సాధ్యమవుతుందన్నారు. అనంతరం విజయవాడ సాంస్కృతిక సమితి వారు ప్రదర్శించిన మమ్మల్ని బతకనివ్వండి నాటకం, కర్నూలు టీజీవీ కళాక్షేత్రం వారు ప్రదర్శించిన జగదేకసుందరి సామా పద్యనాటక ప్రదర్శనలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. ఈసందర్భంగా నటులు, దర్శకులు బీఎం రెడ్డిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పందిళ్ల రమేశ్‌బాబు, ఆకుల శ్రీకాంత్, మారేడోజు సదానందాచారి, జూలూరు నాగరాజు, డా.పొడపల్లి చక్రపాణి, పందిళ్ల అశోక్‌బాబు, కార్యవర్గ సభ్యులు దేవరరాజు రవీంద్రరావు, మాడిశెట్టి రమేశ్, గూడూరు బాలాజీ, కళాకారులు పాల్గొన్నారు.

సీసీఎస్ సభ్యులకు కొత్త పథకాలు

- ఎస్సీఆర్ఈ సీసీఎస్ ప్రెసిడెంట్ చిలుకు స్వామి


సమావేశంలో మాట్లాడుతున్న చిలుకు స్వామి

కాజీపేట రూరల్: సౌత్ సెంట్రల్ రైల్వే ఎంప్లాయీస్ కోఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ (ఎస్సీఆర్ఈ సీసీఎస్) లిమిటెడ్ సభ్యులకు కొత్త పథకాలకు రూపకల్పన చేసినట్లు ప్రెసిడెంట్ డాక్టర్ చిలుకు స్వామి అన్నారు. కాజీపేట రైల్వే జనరల్ ఇన్‌స్టిట్యూట్‌లో గురువారం నామినేటెడ్ డైరెక్టర్ దేవులపల్లి రాఘవేందర్ అధ్యక్షతన ఈసీసీఎస్ 11వ నియోజకవర్గ కాజీపేట డెలిగేట్స్ మీటింగ్ జరిగింది. ముఖ్య అతిథిగా చిలుకు స్వామి హాజరై మాట్లాడుతూ కాజీపేటలోని సుమారు 2,900 మంది సీసీఎస్ సభ్యులకు మెరుగైన సేవలు అందించేందుకు కృషిచేస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 26న సికింద్రాబాద్ హెడ్‌ఆఫీస్‌లో జరిగే డైరెక్టర్ల సమావేశంలో కొత్త పథకాలకు రూపకల్పన చేయనున్నట్లు తెలిపారు. యాక్సిడెంట్ ఇన్స్‌రెన్స్ రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలు, ఒకే లోను సిస్టంలో రూ.20 లక్షలు ఇచ్చేందుకు, దీపావళి కానుకగా సభ్యుల ఖాతాలో డివిడెంట్ జమ, నాన్ రికవరీ కేసులకు లీగల్ నోటీసులు పంపించి చట్టపరంగా రికవరీ చేయుట, మరణించిన సొసైటీ సభ్యుడికి ఫెనరల్ కోసం ఇచ్చే రూ.10 వేల నుంచి రూ.15 వేల వరకు పెంచనున్నట్లు ఆయన తెలిపారు. సమావేశంలో ఈసీసీఎస్ డైరెక్టర్ డాక్టర్ డి.శ్రీనివాస్‌యాదవ్, 10వ నియోజకర్గ డైరెక్టర్ ఓవై స్వామి, డెలిగేట్స్ పాక వేదప్రకాశ్, బి.శ్రీనివాస్, ఇ.రాజేందర్, జి.రాజు, సునీల్, నల్ల రమేశ్, ఎల్‌కే యాదవ్ పాల్గొన్నారు.

దివ్యాంగ విద్యార్థుల ప్రగతికి తోడ్పడాలి


మాట్లాడుతున్న జిల్లా కమ్యూనిటీ మొబిలైజింగ్ కో-ఆర్డినేటర్ బద్దం సుదర్శన్‌రెడ్డి

విద్యారణ్యపురి: దివ్యాంగ విద్యార్థుల ప్రగతికి తోడ్పడేలా ఐఈఆర్పీలు, స్పెషల్ ఎడ్యుకేటర్లు కృషి చేయాలని హనుమకొండ జిల్లా కమ్యూనిటీ మొబిలైజింగ్ కో-ఆర్డినేటర్ బద్దం సుదర్శన్‌రెడ్డి కోరారు. బీఎస్ఐ ఆటిజం అండ్ మల్టీస్పెషాలిటీ చైల్డ్ డెవలప్‌మెంట్ సెంటర్ ఆధ్వర్యంలో రిహాబిలిటేషన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (ఆర్‌సీఐ) సౌజన్యంతో కాజీపేట బాల వికాసలో శిక్షణ నిర్వహించారు. ఫండమెంటల్ ఆఫ్ హియరింగ్ డెఫ్‌నెస్ అండ్ ఆడియోలాజికల్ మేనేజ్‌మెంట్ శిక్షణలో భాగంగా స్పెషల్ ఎడ్యుకేటర్లకు, ఐఈఆర్పీలకు శిక్షణ ఇచ్చారు. ఇందులో ఢిల్లీ నుంచి వచ్చిన డాక్టర్ క్రాంతికుమార్ మాట్లాడుతూ.. మూడు రోజులపాటు శిక్షణ పొందాక ఇందులో నేర్చుకున్న అంశాలను దివ్యాంగ విద్యార్థులకు అమలు చేయాలని సూచించారు. రిసోర్స్ పర్సన్లుగా బీఎస్‌వై ఆటిజం, మల్టీ స్పెషాలిటీ చైల్డ్ డెవలప్‌మెంట్ సెంటర్ డైరెక్టర్ డాక్టర్ బి.నాగరాజు, వరంగల్ సమగ్రశిక్ష కమ్యూనిటీ మొబలైజింగ్ కో-ఆర్డినేటర్ కట్ల శ్రీనివాస్, కిరణ్‌కుమార్, నరేశ్, కపిల్‌రెడ్డి, సంజీవ్‌కుమార్, వరలక్ష్మి, ప్రియాంక, భరత్‌రెడ్డి పాల్గొన్నారు. శిక్షణలో వివిధ జిల్లాల స్పెషల్ ఎడ్యుకేటర్లు, ఐఈఆర్పీలు పాల్గొన్నారు.

అనుమానాస్పదస్థితిలో ఆరేళ్ల బాలుడి మృతి

- నారాయణపురంలో విషాదఛాయలు
- ఇటీవల మెడపై కత్తితో దాడి


మనీశ్‌కుమార్(ఫైల్)

కేసముద్రం: అనుమానాస్పదస్థితిలో బాలుడు మృతి చెందిన సంఘటన మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం నారాయణపురం గ్రామంలో బుధవారం రాత్రి చోటుచేసుకుంది. ఎస్సై మురళీధర్‌రాజు తెలిపిన వివరాల ప్రకారం.. పందుల ఉపేందర్, శిరీష దంపతులకు ఇద్దరు కుమారులు మనీశ్‌కుమార్(6), మోక్షిత్ ఉన్నారు. ఉపేందర్ తన తల్లిదండ్రులు ఎల్లయ్య, మంగమ్మతో కలిసి ఒకే ఇంట్లో ఉంటున్నాడు. ఈ క్రమంలో ఎల్లయ్య మేకలు మేపేందుకు ఊరి బయటకు వెళ్లగా, మంగమ్మ పత్తి ఏరడానికి కూలి పనికి వెళ్లింది. లారీ డ్రైవర్‌గా పనిచేస్తున్న ఉపేందర్ పని నిమిత్తం వెళ్లాడు. శిరీష తన ఇద్దరు కుమారులతో ఇంటివద్దే ఉంది. సాయంత్రం ఇంట్లో పెద్దకుమారుడు మనీశ్‌కుమార్‌ను పడుకోబెట్టి, ఇంటికి కొంతదూరంలో బతుకమ్మ ఆడేందుకు తన చిన్నకుమారుడితో వెళ్లింది. సాయంత్రం కూలి పనికి వెళ్లి వచ్చిన మంగమ్మ తన కోడలు వద్దకు వెళ్లి మనీశ్‌కుమార్ ఎక్కడున్నాడని అడిగింది. జ్వరం వస్తే ఇంట్లో పడుకోబెట్టానని ఆమె తెలిపింది. రాత్రి అయినా మనీశ్‌కుమార్ అలాగే పడుకుని ఉన్నాడు. అన్నం తినిపించడానికి మంగమ్మ మనుమడిని నిద్రలేపే ప్రయత్నం చేయగా అప్పటికే మనీశ్‌కుమార్ మృతి చెంది ఉన్నాడు. దీంతో ఆమె కేకలు పెట్టగా చుట్టుపక్కల వారు వచ్చారు. స్థానిక ఆర్ఎంపీ కూడా బాలుడు మృతి చెందినట్లు తెలిపాడు. బాలుడి మెడ కమిలి ఉండడంతో ఉరివేసి గుర్తుతెలియని వ్యక్తులు చంపి ఉంటారని స్థానికులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా గత జూలై 31న రాత్రి ఇంట్లో నిద్రిస్తున్న మనీశ్‌కుమార్ మెడపై గుర్తుతెలియని వ్యక్తి కత్తితో దాడి చేసిన విషయం తెలిసిందే. ఆ తర్వాత ఆస్పత్రిలో చికిత్స పొంది కోలుకున్న మనీశ్‌కుమార్ అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. కాగా, సంఘటన స్థలానికి పోలీసులు చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జనరల్ ఆస్పత్రికి తరలించారు. మృతుడి నానమ్మ గురువారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

వెంటాడిన మృత్యువు..

పందుల ఉపేందర్, శిరీష దంపతులకు ముగ్గురు కుమారులు మనీశ్‌కుమార్, మోక్షిత్, నిహాల్ ఉన్నారు. 2025 జనవరి నెలలో ఇంటి ఆవరణంలో ఉన్న నీటిసంపులో పడి చిన్నకుమారుడు నిహాల్ మృతి చెందాడు. ఇప్పుడు పెద్దకుమారుడు మనీశ్‌కుమార్ అనుమానాస్పదస్థితిలో మృతి చెందాడు. ఇలా ఆ కుటుంబాన్ని మృత్యువు వెంటాడుతోంది.